ప్రగతి బాటలు

• అద్దంలా రహదారులు • కోట్లాది రూపాయలతో రోడ్లు అభివృద్ధి చేసిన ప్రభుత్వం

నాడు

ఇరుకైన రహదారులు.. అడుగడుగునా గుంతలు.. వానొస్తే బురద.. ఎండొస్తే దుమ్ము.. బండెక్కితే ఉయ్యాల జంపాల.. కిలో మీటర్ దూరానికి పది నిమిషాలకుపైగా సమయం.. గంటకు 20 నుంచి 30 కిలోమీటర్లు దాటని వేగం.. దారిపొడవునా కుదుపులతో ఒళ్లంతా హూనం.. ఇది నాటి టీడీపీ పాలనలో తూర్పు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి.

నేడు

విశాలమైన రోడ్లు.. ట్రాఫిక్ సమస్య లేకుండా సాఫీగా రాకపోకలు.. కిలోమీటర్ల దూరం కూడా నిమిషాల్లోనే వెళ్లే సౌకర్యం .. గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల వాహనాల వేగం.. అంతరాయం, అలసట లేకుండా ప్రయాణం.. వానొచ్చినా.. వరదొచ్చినా ఆటంకం లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరిక.. ఇది నేటి వైఎస్సార్‌సీపీ పాలనలో 'ప్రగతి బాట'లు.

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో రహదారులు అద్దంలా మెరుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో ఇరుకు రోడ్లకు మోక్షం కలిగి విస్తరణకు నోచుకున్నాయి. తూర్పు నియోజకవర్గంలో జీవీఎంసీ జోన్-2 పరిధి 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు ఉన్న అధ్వాన రోడ్లకు నూతన శోభ వచ్చింది. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, 15వ ఆర్థిక సంఘం నిధులతో దాదాపు అన్ని రహదారులకు మోక్షం కలుగుతోంది.

విస్తరణ	నిధులు
చినగదిలి కూడలి-సూర్యతేజానగర్	రూ 2.35 కోట్లు
హనుమంతవాక-కైలాసగిరి కూడలి రోడ్డు	రూ.1.99 కోట్లు
సీతకొండ వద్ద బీచ్ రోడ్డు	రూ.4 కోట్లు
విశాఖ వేలీ కూడలి-బీచ్ రోడ్డు	రూ.6 కోట్లు





వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ నుంచి సీతకొండ చివర వరకు బీచ్‌రోడ్డు

ఆకర్షణీయం.. సీతకొండ రోడ్డు

వీఎంఆర్‌డీఏ అధికారులు సీతకొండ వద్ద బీచ్ రోడ్డును విస్తరిస్తున్నారు. విశాలాక్షినగర్ సమీపం సీతకొండ మలుపు వద్ద వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ నుంచి సీతకొండ చివర వరకు సుమారు 400 మీటర్ల పొడవున 30 అడుగుల రోడ్డును 80 అడుగుల మేర విస్తరిస్తున్నారు. ఇందు కోసం సుమారు రూ.4 కోట్లు కేటాయించారు. ఈ పనులు 80 శాతం పూర్తయ్యాయి. అతి ప్రమాదకరంగా రెండు పెద్ద మలుపులతో ఉండే ఈ రోడ్డు విస్తరణతో ఆకర్షణీయంగా తయారైంది. సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌లు, పచ్చదనంతో తీర్చిదిద్దుతున్నారు.





విశాఖ వ్యాలీ కూడలి నుంచి సీతకొండ చివర బీచ్‌రోడ్డు వరకు డబుల్ రోడ్డు

విశాఖ వ్యాలీ రోడ్డు వరకు..

జాతీయ రహదారిపై విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి నుంచి సీతకొండ చివర బీచ్ రోడ్డు వరకు అటవీ శాఖకు చెందిన రెండు కొండలు(సీతకొండ, జూ పార్కు కొండ) నడుమ సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవు గల ఇరుకు రోడ్డుకు మహర్దశ పట్టింది. ఇక్కడ 20 అడుగుల ఇరుకు రోడ్డు ఉండేది. సుమారు మూడు దశాబ్దాలుగా ఈ రోడ్డులో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆ ఇబ్బందులకు బ్రేక్‌పడింది. వీఎంఆర్‌డీఏ అధికారులు మూడేళ్ల క్రితం దీన్ని 60 అడుగులు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.6 కోట్లు నిధులు మంజూరు చేశారు. మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్, పచ్చదనం ఏర్పాటు చేశారు.

హనుమంతవాక - కైలాసగిరి కూడలి రోడ్డుకు మోక్షం

జీవీఎంసీ 9వ వార్డు హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్‌లో కైలాసగిరి కూడలి వరకు రోడ్డు విస్తరణ, కాలువలు, డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు. కైలాసగిరికి, బీచ్ రోడ్డుకు వెళ్లే రహదారి కావడంతో నిత్యం వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. ఇక్కడ గతంలో 30 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉండేది. దీన్ని 80 అడుగులకు విస్తరించాలని ఆరేళ్ల క్రితం ప్రణాళిక రూపొందించిన గత ప్రభుత్వం పనులు జరిపించకుండా చేతులెత్తేసింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు పనులు చేపట్టింది. రూ.1.99 కోట్లు జీవీఎంసీ నిధులతో సుమారు 1,200 మీటర్ల పొడవున అవసరమైనచోట్ల రోడ్డు విస్తరిస్తూ ఇరువైపులా కాలువలు, పాత్‌వేల నిర్మాణం చేపడుతున్నారు. డబుల్ రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్‌తో రాత్రి వేళ ధగధగ మెరిసేటట్లు తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.



హనుమంతవాక కూడలి నుంచి కైలాసగిరి కూడలి వరకు రోడ్డు

20 నుంచి 80 అడుగులకు విస్తరణ

జీవీఎంసీ 12వ వార్డు బీఆర్‌టీఎస్ చినగదిలి కూడలి వద్ద నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజనగర్ వరకు సుమారు అర కిలోమీటరు పొడవున 20 అడుగుల వెడల్పు రోడ్డు ఉండేది. ఇది ఇరుకుగా ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతూ రాకపోకలు సాగించేవారు. చిన్నపాటి వర్షానికి కూడా ఈ మార్గం జలమయమయ్యేది. ఈ నేపథ్యంలో ఈ రోడ్డు విస్తరణకు రూ 2.35 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. ఆ నిధులతో గతేడాది 60 నుంచి 80 అడుగులు(వీలును బట్టి కొన్నిచోట్ల 60 అడుగులు, ఇంకొన్ని చోట్ల 80 అడుగుల వెడల్పు) రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇరువైపులా ఫుట్‌పాత్, కాలువలతో పాటు డివైడర్ ఏర్పాటు చేశారు. డివైడర్ మధ్యలో పూల మొక్కలు నాటనున్నారు. మధ్యలో సెంట్రల్ లైటింగ్ కోసం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.





చినగదిలి సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజనగర్ రోడ్డు

ఇరుకు రోడ్డు సమస్య తీరింది..



చినగదిలి కూడలి నుంచి ఆరిలోవకు వెళ్లే రోడ్డు నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజనగర్ వరకు ఇరుకుగా ఉండేది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడేవారు. ఎదురెదురుగా వస్తూ ఢీకొని ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. వర్షం పడితే రోడ్డుపై నీరు నిలిచిపోయి చెరువును తలపించేది. ఇప్పుడు ఈ రోడ్డును విస్తరించారు. బీఆర్‌టీఎస్ వరకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఆరిలోవ కాలనీల నుంచి ఈ రోడ్డులో సులువుగా ప్రయాణిస్తున్నారు. సుమారు 20 ఏళ్ల నుంచి ఇరుకుగా ఉన్న ఈ రోడ్డుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోక్షం కలిగింది.

– వానపల్లి అప్పారావు, నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ ట్రస్టీ చైర్మన్,

30 ఏళ్ల కల నెరవేరింది



హనుమంతవాక జంక్షన్ నుంచి విశాలాక్షినగర్‌లో కైలాసగిరి కూడలి వరకు 30 ఏళ్లుగా ఉన్న సమస్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీరింది. ఇక్కడ కాలువలు లేకుండా చిన్న రోడ్డు ఉండేది. దీంతో వర్షం పడినప్పుడు కొండ పైనుంచి వచ్చిన వరద నీరు నేరుగా వీధుల్లోకి చేరి నిలిచిపోయేది. ఆ సమయంలో ప్రజలు వీధుల్లోకి రాలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు రోడ్డు విస్తరణ చేపట్టారు. కాలువలు నిర్మిస్తున్నారు. దీంతో ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం లభించింది. ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– సత్తి నాగేశ్వరరెడ్డి, విశాలాక్షినగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా

గ్రంథాలయాలతో విజ్ఞానం



ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: స్థానిక ఏఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథ్ చిత్ర పటానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కాసు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధి ద్వారా దేశ ప్రజల విజ్ఞానానికి బాటలు వేసిన ఘనత ఎస్‌ఆర్ రంగనాథ్‌కు దక్కుతుందన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, బృంద చర్చలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సమత కళాశాలలో మంగళవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల విజేతలకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పలు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీజీఆర్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఉమామహేశ్వరయాదవ్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక విజ్ఞానంపై అవగాహన పెంచేందుకు ఏటా జాతీయ స్థాయిలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు.

నాక్ ర్యాంకు సాధన అభినందనీయం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నాక్ గ్రేడింగ్‌లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానం సాధించడంపై ఏయూ అనుబంధ బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని తన కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: ఏయూ నాక్ ర్యాంకు సాధించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని మంగళవారం కలిసి అభినందలు తెలియజేశారు. ఈ ర్యాంకు సాధనతో ఏయూతో పాటు విశాఖ నగరానికి సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీవీ రమణారెడ్డి, బి.మంగరాజు, మద్ది లక్ష్మణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సేవా కార్యక్రమాలు



ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయిబాబా 98వ జయంతిని పురస్కరించుకుని శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. ఇందులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. పేదలు, అనాథలకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులకు చెప్పులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాదళ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరించిన హాస్టల్ మెస్ ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల పరిధిలో ఆధునికీకరించిన హాస్టల్ మెస్‌ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మంగళవారం ప్రారంభించారు. మెస్‌లో కిచెన్, భోజనశాలను నాడు-నేడు స్ఫూర్తితో పూర్తి స్థాయిలో ఆధునికీకరించారు. అనంతరం నాక్ విజయోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఆచార్య టి.శోభశ్రీ, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, చీఫ్ వార్డెన్ ఆచార్య జి.వీర్రాజు పాల్గొన్నారు.

భవిష్యత్ సీఈవోలుగా ఎదగాలి

ఫార్మా రంగంలో భవిష్యత్ తరం సీఈవోలుగా ఏయూ విద్యార్థులు ఎదగాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఏయూ ఫార్మసీ విద్యార్థినుల హాస్టల్‌లో ఏర్పాటు చేసిన నాక్ విజయోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏయూ ఫార్మసీ కళాశాల ఎందరో నిపుణులను ప్రపంచానికి అందించిందన్నారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడేలా ఉన్న లక్ష్యాలతో ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, వి.విజయలక్ష్మి, చీఫ్ వార్డెన్ ఎ.కె.ఎం.పవార్ పాల్గొన్నారు.



హాస్టల్ మెస్ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ స్టీఫెన్

ఘనంగా బీఆర్ రావు జయంతి

ఏయూ క్యాంపస్: భౌతికశాస్త్రవేత్త, భట్నాగర్ అవార్డు గ్రహీత ఆచార్య బీఆర్ రావు అందించిన సేవలు శ్లాఘనీయమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ భౌతిక శాస్త్ర విభాగంలో ఆచార్య బీఆర్ రావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మంగళవారం ఉదయం పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ బీఆర్ రావు ఏయూ ఆచార్యునిగా, జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు, పేరు ప్రతిష్టను నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ఆచార్య ఎస్.వి.సుధాకర్, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, మత్స్యకార నాయకులు టి.శాంతారామ్, ఏయూ మత్స్యకార ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాంబాబు, ప్రధాన కార్యదర్శి వీరకుమార్, సిహెచ్.డి.ఆర్.ప్రకాష్, పెద్ద సంఖ్యలో ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



బీఆర్ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న రిజిస్ట్రార్

ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ లీడర్‌షిప్ పుస్తకావిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు రచించిన ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ లీడర్‌షిప్ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత ఆచార్య టి.షారోన్ రాజును వీసీ అభినందించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా వర్తమాన అంశాలపై కాలానుగుణంగా పుస్తక రచన చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. పుస్తక రచయిత మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ చరిత్ర, విద్యలో నాయకత్వం, నాయకత్వ సిద్ధాంతాలు, డిఫెన్స్ లీడర్‌షిప్, డిఫెన్స్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను వివరించినట్టు చెప్పారు. విద్యార్థులు, యువత భవిష్యత్ తరం నాయకులుగా ఎదగడానికి ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు.

ఏయూతో శ్రీలంక వర్సిటీ ఎంవోయూ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో శ్రీలంకకు చెందిన శ్రీ జయవర్ధనపుర విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా ఏయూలో పాలీ, బౌద్ధ అధ్యయనాలపై ఎంఏ కోర్సును ప్రారంభిస్తారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య భానుకుమార్, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, జయవర్ధన విశ్వవిద్యాలయం ఆచార్యులు మడగంపిటియే విజిత థెరో పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే'

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. 22వ సచివాలయం పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి.వెంకటేశ్వరరావు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పార్టీ జెండా, సంక్షేమ పథకాలు బోర్డు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎంతో మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. అందుకే ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగ్గపిల్లి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, అయ్యారెకల కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



10వ వార్డులో జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

24న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టీమ్ లీజ్, శరణ్ మోటార్స్, మెడ్ ప్లస్, ఫ్లిప్ కార్ట్, ఆడెక్కో, లాస్య ఇంజినీరింగ్ సొల్యూషన్స్, ఎస్‌వీవీ ఇన్ఫోటెక్, వీల్స్ మార్ట్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 775 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. జూనియర్ కెమిస్ట్, ఆఫీసర్, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, టెలికాలర్, రికవరీ, క్లర్కు, బ్రాంచి ఇన్‌చార్జి, ఎగ్జిక్యూటివ్, సీఆర్‌ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు రావాలని కోరారు.

మధురం.. ఐఏఎస్ అధికారి లక్ష్మీశ గానం

మద్దిలపాలెం : తన మధురం గానంతో సంగీత ప్రియులను ఉర్రూతలూగించారు ఓ యువ ఐఏఎస్ అధికారి. గతంలో జీవీఎంసీ కమిషనర్‌గా పని చేసిన డాక్టర్ లక్ష్మీశ మంగళవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఒకసారిగా గాయకుడిగా కనిపించారు. ఈయన ప్రస్తుతం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. యాక్మీ సంస్థ 15వ వార్షికోత్సవంలో భాగంగా నటశేఖర్ సూపర్‌స్టార్ కృష్ణ స్మృత్యంజలి పేరిట నిర్వహించిన సంగీత విభావరిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీశ, గాయకులు రాము, నాదప్రియ, నిత్య సంతోషిణి, హరిణిలతో కలిసి పలు గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు.



పాటలు ఆలపిస్తున్న ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీశ

యువతులను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

దొండపర్తి : సోషల్ మీడియా ద్వారా యువతులతో పరిచయం పెంచుకొని, ఆ తర్వాత న్యూడ్ ఫొటోలు ఉన్నాయని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సోమేశ్వరరావు తెలిపారు. నగరంలో అవివాహితులకు షాప్‌చాట్ అకౌంట్ నుంచి ఓ యువకుడు రిక్వెస్ట్ పంపించి, మాయ మాటలతో వారితో నగ్నంగా వీడియో కాల్ చేయించుకుని అది రికార్డు చేస్తున్నాడు.

ఆ తర్వాత నగదు ఇమ్మని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. దీంతో బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వివరాల మేరకు సాంకేతిక ఆధారంగా పోలీసులు ఆరా తీశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన చిక్కుడు చంద్రమోహన్ అనే యువకుడిగా గుర్తించారు. పక్కా ఆధారాలతో అతడిని అరెస్టు చేసి, రిమాండ్ తరలించామని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సోమేశ్వరరావు తెలిపారు. కూలి పనులు చేస్తున్న అతడు సోషల్ మీడియాలో అకౌంట్ ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడు, సుబ్రహ్మణ్య స్వామిలకు కార్తీక మాసం తొలి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.